క్లుప్తంగా

రజకులపై జరుగుతున్న దాడులపై స్పందించరా..?

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల వారం రోజుల తేడాతో రజకులపై జరుగుతున్న వరుస దాడులపై రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మెన్ స్పందించకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ లోగిడి జయన్న విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రజక కులస్తులను ఇతర వర్గాలు భయభ్రాంతులకు గురిచేస్తున్న తరుణంలో వారికి నేనున్నాననే భరోసాను రజక బిడ్డగా ఆయన ఇవ్వలేకపోయారన్నారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండి ఆ దాడులపై కనీసం నోరు తెరచి మాట్లడక పోవడం రజకుల దురదృష్టమన్నారు.

యంత్రాల ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న హరూన్ గ్రూప్ డైరెక్టర్లు అర్షద్‌బాషా, ఆసిఫ్ బాషా

కడప కార్పొరేషన్ : కడప పట్టణంలో మేము విరెజెన్ గ్రూప్ హమేషా రోడ్ షోలో భాగంగా సాయిల్ కాంపాక్టర్ టెన్‌డమ్ రోలర్ యంత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరూన్ గ్రూప్ డైరెక్టర్లు ఎస్‌బి అర్షద్‌బాషా, ఎస్‌బి ఆసిఫ్‌బాషాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిల్ కాంపాక్టర్, హెచ్‌ఏఎంఎం రోలర్ యంత్రాలు ప్రత్యేక లక్షణాలు, డిజైన్ కలిగి ఉన్నాయన్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో ఇవి చురుకైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా, కాంట్రాక్టర్లు బసవరాజు, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని శుక్రవారం రాత్రి మలుపు వద్ద జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డంగా ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ జామ్ అయింది. ట్యాంకర్‌లోని ఆయిల్ లీక్ కావడంతో వాహనాలు పట్టు తప్పి కిందపడ్డాయి. శనివారం ఉదయం కంకర డస్ట్ ఆయిల్‌పై వేసి క్రేన్ల సహాయంతో ఆయిల్ ట్యాంకర్‌ను తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.

మానవతా విలువలు పాటించాలి

కమలాపురం : మహమ్మద్ ప్రవక్త చెప్పిన విధంగా మానవతా విలువలు పాటిస్తూ పరమత సహనం, శాంతి, కలిగి ఉండాలని స్థానిక పెద్ద దర్గా పీఠాధిపతి సోదరుడు దస్తగిరి స్వామి అన్నారు. కుమ్మర వీధిలో వెలసిన మదరసా ఏ షహమీరియా తాళిముల్ ఖురాన్ వద్ద నౌజవాన్ కమిటీ సభ్యులు, లవకుశ ఫారుక్, 16వ వార్డు కౌన్సిలర్ ఖాజా హుసేన్, అయుబ్, కెప్టెన్ బాబు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సన్మానం

సిద్దవటం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐసీడీఎస్ భాకరాపేట సెక్టారులో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం హ్యాపీ కిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ అనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరవై మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. పాఠశాల హెడ్మాస్టర్ జొన్నాదుల శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి లక్ష్మిదేవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్, సుబ్బమ్మ కోరారు. శనివారం వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రెగ్యులర్ చేసి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం అంగన్వాడీ వర్కర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా వినోదాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దస్తగిరమ్మ, ప్రధాన కార్యదర్శి గా మేరీ, ఉపాధ్యక్షురాలుగా ఓబుళాపురం విజయమ్మ, కోశాధికారిగా జ్యోతిమ్మతో పాటు 16 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో అంగన్వాడీ ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

వెల్లాల ఆలయానికి రూ.2 లక్షలు వితరణ

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీ సంజీవరాయస్వామి ఆలయానికి శనివారం రూ.2లక్షలు విరాళం అందించినట్లు సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, ఉత్సవ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి తెలిపారు. కడప నగరం సాయిపేటకు చెందిన బండి ఆంజనేయులు, దేవకీదేవి దంపతులు రూ.2,00,116 విరాళంగా ఇచ్చారన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ అని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శనివారం సాయంత్రం హరిత హోటల్ సమావేశ మందిరంలో కడప మండల సౌత్‌జోన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదిహేను నెలల కాలంగా ఈ కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి ఏ విధంగా వెన్నుపోటు పొడుస్తుందో యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందో అందరికీ తెలుసన్నారు. గత ముఖ్యమంత్రి వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99% నెరవేర్చి భారతదేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా గుర్తింపు పొంది ఆంధ్రరాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచారు. కానీ ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల పేరుతో.. నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 18 వేలు, నీకు 18 వేలు, నీకు 18 వేలు అని చెప్పి ప్రజలను నమ్మించి ఓట్లేయించుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విధంగా మోసం చేస్తున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. ఒక్కొక్క కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎంత బాకీ వుందో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం ద్వారా ప్రజలలోకి తీసుకొని వస్తున్నామన్నారు.

యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి యువతను మోసం చేశారన్నారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్నారు.. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఆంధ్ర రాష్ట్ర యువతను మొత్తం నట్టేట ముంచేశారన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని, మొదటి ఏడాది ఇవ్వలేదని, రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చారన్నారు.

■ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచడం తప్పా ఇచ్చింది ఏమీ లేదన్నారు. 9 గంటల పాటు రోజు ఉచిత విద్యుత్ సరఫరా, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు అని రైతులను నమ్మించిన ప్రభుత్వం ఇప్పుడు వారి ఆత్మహత్యకు కారణమవుతోందన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని దాన్ని పీ4కు అప్పగించామని చెప్పడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు తెలుసుకొని బుద్ధి చెప్పాలని కోరారు.

■ ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సౌత్ జోన్ అధ్యక్షుడు ఐస్‌క్రీం రవి, నార్త్‌జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, సుబ్బరాయుడు, దేవిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

‘రైతుపోరు’ను జయప్రదం చేయాలి

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రైతుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించే ‘రైతు పోరు’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడానికి రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, మొదటి ఏడాది ఎగ్గొట్టిందన్నారు. రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చి మోసం చేసిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక వారు విలవిల్లాడుతున్నారన్నారు. 9వ తేది అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే ర్యాలీల ద్వారానైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందేమో చూడాలన్నారు. లేనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్, బీహెచ్ ఇలియాస్, వేణుగోపాల్ నాయక్, సునీత, బి. మరియలు, గుంటి ప్రసాద్, పస్తం అంజి, రమేష్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిజం వృత్తి అత్యంత కీలకం

కడప కార్పొరేషన్ : ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో జర్నలిజం వృత్తి ఎంతో అత్యంత కీలకమైందని ఆర్యవైశ్య సభ అనుబంధ సంఘం వాసవి క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ జయంతి సందర్భంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పలు సేవా కార్యక్రమాలలో భాగంగా పలువురు జర్నలిస్టులను సత్కరించారు. స్థానిక నాగరాజుపేటలోని వాసవి క్లబ్ కార్యాలయంలో జర్నలిస్టులను వారు ఆత్మీయంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షులు దరిశా శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, క్లబ్ సభ్యులు గుడిగుంట్ల లక్ష్మయ్య, మాడి శెట్టి నారాయణ, మాలేపాటి రవీంద్ర నాద్, మునగా రాఘవ, పుట్టా వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎస్ రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : బీసీ పెన్షనర్స్ ,ఉద్యోగుల ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఈనెల 13 తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలో ఉండే బీసీ ఉద్యోగులందరూ తరలి రావాలని బీసీ పెన్షనర్స్, ఉద్యోగుల ఉపాధ్యాయుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎస్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. కడప జిల్లా ఎస్ టి ఎఫ్ జిల్లా కార్యాలయంలో వారాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన బిసి ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణం, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉత్పాదక వర్గాలైన బీసీలు దశాబ్దాలుగా అణిచివేతకు, దోపిడీకి గురవుతున్నారన్నారు. బీసీలలో చాలామంది చిన్న వ్యాపారాలు, కూలి, వృత్తి పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం బీసీలకు సహకార బ్యాంకులు స్థాపించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వారాల శ్రీనివాసులు, సుబ్బయ్య, నాగరాజు, కూరాకు రవీంద్ర, ప్రొఫెసర్ రంగనాథం, మజారి చెన్నకేశవులు, రాజశేఖర్, సుధాకర్, కోప్పూరి నాగరాజు, సాగర్, రామ్మోహన్, మంచా వెంకట సుబ్బయ్య, రామసుబ్బన్న పాల్గొన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం ‘శక్తి’ యాప్

కడప అర్బన్: జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, పాఠశాలలు, కళాశాలల్లో ‘శక్తి’ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ‘శక్తి’ యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని ‘శక్తి’ టీమ్ మహిళా ఎస్.ఐ శాంతమ్మ తెలిపారు. ఈ యాప్ ప్రాముఖ్యత, దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై కడప నగరంలోని రిమ్స్ నర్సింగ్ విద్యార్థినుల వసతి గృహంలో శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

– డయల్ 100/112 (అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), గృహహింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ హాస్టల్ ఎస్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ వి. శివ కుమారి, హాస్టల్ వార్డెన్ వి. సంధ్యారాణి,నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నగరంలో అక్షరాస్యత వారోత్సవాలు


మాట్లాడుతున్న వయోజన విద్య ఉప సంచాలకులు సుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప నగరంలో అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేది నుంచి ప్రారంభమైన ఈ వారోత్సవాలు 8వ తేది వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా శనివారం కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీహరి డిగ్రీ కళాశాల, హౌసింగ్‌బోర్డులోని మెప్మా కార్యాలయంలో అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని వయోజన విద్య ఉప సంచాలకులు సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనపుడే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ విషయంగా చదువురాని వారిని చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


కడప అర్బన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధు మల్లేశ్వర రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత బస్ స్టాండ్ వద్ద రాపిడో రైడర్స్ కు అవగాహన కల్పించారు. అనంతరం సంబంధిత పోస్టర్లను రద్దీ ప్రదేశాల్లో గోడలకు అతికించారు. ఎవ్వరైనా ముందుగా డబ్బులు అడిగితే లేదా స్కానర్ ద్వారా డబ్బులు పంపమంటే నమ్మవద్దన్నారు. అధికారిక యాప్ లేదా సురక్షిత మార్గాల్లో మాత్రమే లావాదేవీలు చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలపాలన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అమెరికాలో దిగుమతి సుంకం పెంపు ప్రభావం భారతదేశ వ్యవసాయ అనుబంధ ఆక్వా, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమెరికా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయన్నారు. ఇప్పటికే అమెరికా వెళ్లినవారి పరిస్థితి కూడా అగమ్యగోచరంగా ఉందన్నారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కిమ్మనకపోవడం గర్హనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఓబయ్య, డబ్ల్యూ రాము, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, కేసీ బాదుల్లా, మద్దిలేటి శంకర్ నాయక్, వెంకట్ రాముడు, అన్వేష్, దస్తగిరి రెడ్డి, మునయ్య, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, ప్రభాకర్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రవక్త మార్గాన్ని అనుసరించాలి


భక్తులతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్న ఇలియాస్, మున్నా తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సర్వమానవాళికి దిక్సూచిగా ఉంటున్న మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైఎస్సార్ సీపీ గల్ఫ్ ప్రతినిధి బీహెచ్ ఇలియాస్ పిలుపునిచ్చారు. మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని కడప నగరంలో శనివారం సయ్యద్ షైదానిబీ పీఠం ప్రతినిధి మున్నా ఆధ్వర్యంలో మహా ప్రవక్తకు చెందిన పలు వస్తువులను భక్తులకు తిలకింపజేశారు. అనంతరం కడప నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మహా ప్రవక్తకు సంబంధించి సామాగ్రిని దర్శించుకున్నారు. చివరగా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు గయాజ్, అక్బర్, షంషీర్, పవర్ అల్తాఫ్, ఆరీఫ్, అజ్మతుల్లా పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. వేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గురువులకు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కడప కలెక్టరేట్‌లోని సభా భవనంలో పలువురు గురువులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

– కడప ఎడ్యుకేషన్


నాగమణి, హెచ్‌ఎం, కడప


దాది నాగరాజు, ప్రైమరీ హెచ్‌ఎం, కడప


సయ్యద్ నూర్, స్కూలు అసిస్టెంట్, కడప


అరుణకుమారి, స్కూలు అసిస్టెంట్, కడప


మేరి సువర్ణ, ఎస్‌జీటీ, కడప

యూబీఐలో అవినీతి నిర్మూలన వారోత్సవం


అవినీతి నిర్మూలన వారోత్సవాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న యూబీఐ అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కడప ప్రాంతీయ కార్యాలయంలో అవినీతి నిర్మూలన వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యాలయ అధికారి లక్ష్మితులసి మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీ తనంతో వ్యవహరించాలన్నారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాల్లో అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ, అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రీజినల్ మేనేజర్లు రంజిత్‌కుమార్, ఎస్‌కే బాష, విజిలెన్స్ అధికారి సంతోష్ కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డును నిర్మించాలి


సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరం 11వ డివిజన్ పరిధిలోని మృత్యుంజయ కుంటలో శివాలయం వెనుకనున్న రామాలయం వీధిలో శాంక్షన్ అయిన సిమెంట్ రోడ్డును తక్షణం నిర్మించాలని 11 వ డివిజన్ సీపీఐ నాయకురాలు వడ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు మహిళలు సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాలయం వీధి డోర్ నెంబర్ 42/972 వీధిలో ఏళ్ల తరబడి సిమెంటు రోడ్డు నిర్మించాలని వినతి పత్రాలు సమర్పించామని, ధర్నాలు సైతం చేపట్టామన్నారు. జనరల్ ఫండ్ కింద, 15 వ ఫైనాన్స్ నిధుల కింద రోడ్డు, డ్రైనేజ్ కాలువ మంజూరైనప్పటికీ నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. చిన్నపాటి వర్షానికి వీధి అంతా గుంతల మయంగా బురద మట్టిలో జనం తిరగడానికి ఇబ్బందిగా ఉందన్నారు. తక్షణం రోడ్డు డ్రైనేజీ కాలువను నిర్మించాలన్నారు. లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, మల్లిక, పెంచలమ్మ, ఉమాదేవి, గంగమ్మ, వరలక్ష్మి, రవణమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన


ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా ఆర్‌సీఎం డయాసిస్ పరిధిలో ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ విషయాల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యు, ఏఐఎస్‌బి, పీఎస్‌యూ డిమాండ్ చేశాయి. శనివారం కడపలోని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంకన్న, సుబ్బారాయుడు, జయవర్ధన్ లు మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరంలో ఆర్‌సీఎం డయాసిస్ ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాలలలో 26 పోస్టులు భర్తీ చేయడానికి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకొని రోస్టర్ పద్ధతి ప్రకారం పాటించకుండా వారికి ఇష్టం వచ్చినటువంటి పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసుకొన్నారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరపాలన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ ఏడీ విజయ్ కుమార్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, పీఎస్ యు జిల్లా కన్వీనర్ గోపి, పీడీఎస్‌యూ నగర నాయకుడు కార్తీక్, సురేంద్ర, సుధీర్, మహేష్, ఖలీల్, ఇంతియాజ్, మనోహర్, వెంకటేష్, శ్రీనివాసులు రెడ్డి, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి


ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు క్రమశిక్షణాయుత వాతావరణంలో కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని గవర్నమెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి చార్ల రూతు ఆరోగ్యమేరి పిలుపునిచ్చారు. శనివారం కడప నగర శివార్లలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. లక్ష్య సాధనకు ప్రతి విద్యార్థి శ్రమించాలని సూచించారు. కళాశాల చైర్మన్ కొమ్మా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు. అనంతరం జాగర్లమూడి జాతర సినిమా యూనిట్ తమ టీజర్, సాంగ్స్‌ను విద్యార్థుల కోలాహలం మధ్య విడుదల చేశారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరినీ అలరించాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎ.చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి, సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ రామ్ పవన్ రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు అందించాలి


ఏఓ ఖాదర్‌బాషకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : వేంపల్లి గ్రామపంచాయతీ లోని పారిశుద్ధ్య కార్మికులు, తాగునీటి సరఫరా సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు అందక కష్టాల కడలిలో సమ్మె చేస్తున్నారని, తక్షణమే వారికి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం ఈ మేరకు వారు కలెక్టరేట్ కార్యాలయంలోని పంచాయతీ కార్యాలయంలో ఏవో ఖాదర్ బాషకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కార్మికులు తమ కుటుంబాల పోషణ కోసం కష్టతరమైన సమ్మె చేస్తున్నారని, కరెంట్ చార్జీలు, పాలు, ఇంటి బాడుగలు, పిల్లల చదువులు భారంగా మారాయని, ఆసుపత్రులకు అప్పులు చేసి ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో నిధులు ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్టుగా కార్మికుల పరిస్థితి ఉందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగ సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా, జిల్లా కార్యదర్శి జి.మద్దిలేటి, నగర అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్ కుమార్

రాజంపేట : ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మూడో అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పోలీసులు, అధికారులు, బ్యాంకు అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ వారితో కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ అయ్యే కేసుల కక్షిదారులను పిలిపించి పరిష్కరించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కేసుల సామరస్యరీతిలో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని చెప్పారు. ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జడ్జి తెలిపారు. సమావేశంలో పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు, బార్ ప్రెసిడెంటు పి.హనుమత్ నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.